# ప్రజలతో మమేకం

- 'మీరు నేను'లో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్
- తట్లావాయి, ధర్మాజీపేట, అలియానాయక్ తండాల్లో పర్యటన
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- సంక్షేమ పథకాల అమలుతీరు పరిశీలన



సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

రాయికల్, జూలై 3: జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ప్రజలతో మమేకమవుతున్నారు. 'మీరు నేను'లో భాగంగా సోమవారం రాయికల్ మండలంలోని తాట్లవాయి, ధర్మాజీపేట, అలియానాయక్ తండాల్లో పర్యటించారు. ప్రజలను ఆప్యాయంగా పలుకరిస్తూ.. సమస్యలకు పరిష్కారం చూపుతూ ముందుకుసాగారు. సంక్షేమ పథకాల అమలుతీరును పరిశీలించారు. తాట్లవాయిలో ₹10లక్షలతో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. యాదవ సంఘం భవనం నిర్మాణానికి మంజూరైన ₹2.80 లక్షల ప్రొసీడింగ్ కాపీని సంఘం సభ్యులకు అందజేశారు. హనుమాన్, రామాలయాల్లో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ ఆలయ అభివృద్ధికి మంజూరు చేసిన ₹2 లక్షల ప్రొసీడింగ్స్‌ను గ్రామస్తులకు అందజేశారు. కట్కాపూర్‌లో పల్లె దవాఖానను సందర్శించారు. వైద్యసేవల వివరాలను తెలుసుకున్నారు. అలియానాయక్ తండా కూడలిలో ₹1.50 లక్షలతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్‌ను ప్రారంభించారు. లావుడ్యా చిట్టికి మంజూరైన ₹14 వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆమె కుటుంబీకులకు అందజేశారు. ధర్మాజీపేటలో రూ.3 లక్షలతో మాల సంఘం, రూ.3 లక్షతో మహేంద్ర మేదరి సంఘం భవనాలకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. శ్రీ కృష్ణ యాదవ సంఘానికి రూ.2 లక్షలు మంజూరు చేయించారు. గ్రామానికి చెందిన భూక్యా దేశాయ్ భార్య భారతి కిడ్నీ శస్త్ర చికిత్స చేయించుకోగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. ఇక్కడ ఎంపీపీ లావుడ్యా సంధ్యారాణి, జడ్పీటీసీ అశ్విని జాదవ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కోల శ్రీనివాస్, సర్పంచ్‌లు స్నేహలత, సాగరిక, నందునాయక్, హరీశ్, వైస్ ఎంపీపీ మహేశ్వరరావు, యూత్ మండలాధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.



# సాయి సన్నిధిలో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

కోరుట్ల షిర్డీ సాయిబాబా ఆలయ ప్రదక్షిణ చేస్తున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

గురుపౌర్ణమి సందర్భంగా కోరుట్ల పట్టణంలోని షీర్డీ సాయిబాబా ఆలయంలో సోమవారం వేడుకలు ఘనంగా నిర్వహించగా, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు దంపతులు పాల్గొన్నారు. స్వామివారి పల్లకి సేవ, పతాకావిష్కరణలో పాల్గొని స్వామివారికి పాలాభిషేకం చేశారు. అనంతరం అర్చకులు ఎమ్మెల్యే దంపతులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఇక్కడ ఆలయ కమిటీ అధ్యక్షుడు చిద్రాల భూమయ్య, సభ్యులు, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్, కౌన్సిలర్లు మోర్తాడ్ లక్ష్మీనారాయణ, జిందం లక్ష్మీనారాయణ, నాయకులు ఉన్నారు. –కోరుట్ల, జూలై 3

# జీవితపు లోతుల్లోంచే గంభీరమైన కవిత్వం

- ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్
- కరీంనగర్‌లో గండ్ర హన్మంత రావు స్మారక పురస్కారాల అందజేత
- పాల్గొన్న మేయర్, కవులు



పురస్కార గ్రహీతలతో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మేయర్ సునీల్ రావు, కవులు

కమాన్‌చౌరస్తా, జూలై 3: జీవితపు లోతుల్లోంచే గంభీరమైన కవిత్వం వస్తుందని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ పేర్కొన్నారు. నగరంలోని ఫిలిమ్‌భవన్‌లో తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సాహితీవేత్త డాక్టర్ గండ్ర లక్ష్మణ్ రావు తండ్రి గండ్ర హన్మంత రావు పేరిట ఇచ్చిన స్మారక సాహితీ పురస్కారాల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2021సంవత్సరానికిగాను 'జీవన హిందోళం' పుస్తక రచయిత ఆచార్య గుమ్మన్నగారి బాల శ్రీనివాసమూర్తి తరపున ఆయన కొడుకు గౌతమ్, 2022కు గాను ఝోళి పుస్తక రచయిత ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన ఆచార్య సూర్యా ధనంజయ్‌కు మేయర్ వై సునీల్ రావుతో కలిసి పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ ఒక బలమైన వాక్యం రావాలంటే ఎంతో తపించాలని, ఆధునిక కవిత్వం మనిషి కేంద్రంగా వస్తున్నదన్నారు. సులభంగా కనిపించేదాన్ని రాయడం కష్టమన్నారు. మేయర్ సునీల్ రావు మాట్లాడుతూ, కవులకు చిరునామా కరీంనగర్ అన్నారు. సాహితీ భవనం పూర్తి చేయించడం తన బాధ్యత అని వ్యాఖ్యానించారు. అనంతరం కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వారాల ఆనంద్, రచయిత విశ్లేషకులు దాస్యం సేనాధిపతి, సాహితీ గౌతమి అధ్యక్షుడు నంది శ్రీనివాస్, కవి వజ్జల శివకుమార్, పురస్కార గ్రహీతలకు అభినందనలు తెలిపారు. ఝోళి పుస్తకాన్ని కోఠి మహిళా కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఎం దేవేంద్ర, జీవన హిందోళం పుస్తకాన్ని డా. గండ్ర లక్ష్మణ్ రావు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు పాలనాధికారి శ్యాంప్రసాద్ లాల్, సంస్థ ప్రధాన కార్యదర్శి దుమ్మటి శంకర్ ప్రసాద్, గాజుల రవీందర్, అన్నవరం దేవేందర్, బొమ్మకంటి కిషన్, బీవీఎన్ స్వామి, ప్రేమ్ సాగర్ రావు, నీలగిరి అనిత, గంగుల శ్రీకర్, స్తంభం కాడి గంగాధర్, గజేందర్ రెడ్డి, పద్మశ్రీ ఉన్నారు.




సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న గిరిజనులు

# పోడు పట్టాలపై గిరిజనుల ఆనందం

ఎల్లారెడ్డిపేట, జూలై 3: అన్నం పెడుతున్న భూమికి హక్కు పత్రాలు లేక ఏండ్లుగా ఇబ్బందులు పడుతున్న గిరిపుత్రుల దశాబ్దాల కలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం నెరవేర్చింది. కాస్తులో ఉన్నామనే మాటే గానీ ఎప్పుడు ఎవరు వస్తారో..? కాదు పొమ్మంటారోనన్న భయంతో ఏండ్లుగా నరకం చూస్తున్న లంబాడీలు, బంజారాలు, ఆదివాసీల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ, ఇటీవలే పట్టాలు పంపిణీ చేయగా, గిరిజనులు సంబురపడుతున్నారు. సోమవారం ఎల్లారెడ్డిపేట మండలం గుంటపల్లి చెరువుతండాలో పోడు రైతులకు పట్టాలు ఇప్పించిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలతో కూడిన ఫ్లెక్సీకి ఆల్ ఇండియా బంజారా సేవాలాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు అజ్మీరా రాజునాయక్, జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడు అజ్మీరా తిరుపతి నాయక్, సర్పంచ్ మాలోత్ సునీతతో కలిసి పాలాభిషేకం చేశారు. రైతు బంధు, రైతుబీమా కూడా వర్తింపజేస్తామని హామీ ఇవ్వడంతో హర్షం వ్యక్తం చేశారు. ఇక్కడ ఉప సర్పంచ్ కైలాస్, నాయకులు మాలోత్ పూన్యా, గణేశ్ నాయక్, తిరుపతినాయక్, సంతోష్‌నాయక్ తదితరులు ఉన్నారు.

# నియోజకవర్గంలో 3 వేల మందికి గృహలక్ష్మి



- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి
- హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్

పాల్గొన్న ఇన్‌చార్జి కలెక్టర్, అధికారులు

కలెక్టరేట్, జూలై 3: రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 3 వేల మందికి గృహలక్ష్మి పథకం అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. ఇందుకు అవసరమైన లబ్ధిదారులను ఎంపిక చేసే ప్రక్రియ ప్రారంభించాలని కలెక్టర్లకు సూచించారు. సోమవారం రాత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో మాట్లాడారు. తెలంగాణకు హరితహారం, సీఎంఆర్, సోషల్ వెల్ఫేర్, బీసీ కుల వృత్తులకు ఆర్థిక సాయం, గృహలక్ష్మి, గొర్ల పంపిణీ, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణం, వైకుంఠధామాలకు విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గృహలక్ష్మి పథకంలో ఎంపికైన లబ్ధిదారులకు మూడు విడతలుగా ప్రకటించిన మేరకు సాయం అందించనున్నట్లు వెల్లడించారు. విడతకు రూ.లక్ష చొప్పున బ్యాంకులో జమచేయనున్నట్లు చెప్పారు. ఆయిల్‌ఫామ్ సాగు పట్ల రైతులు ఆసక్తిచూపేలా ప్రోత్సహించాలన్నారు. హరితహారం కార్యక్రమానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ఈ సీజన్‌లో నిర్దేశించిన లక్ష్యం పూర్తిస్థాయిలో చేరుకునేలా కృషి చేయాలన్నారు. బీసీ కులవృత్తుల దరఖాస్తుల పరిశీలన నాలుగు రోజుల్లో పూర్తవుతుందని, ప్రతి నెల 15వ తేదీన ప్రజాప్రతినిధుల సమక్షంలో అర్హులకు సాయం అందిస్తామని చెప్పారు. ఇంచార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ మాట్లాడుతూ జిల్లాలో ఆయిల్ పామ్ పంట సాగు లక్ష్యం 4,700 ఎకరాలు కాగా, ఇప్పటివరకు 345ఎకరాల్లో మాత్రమే మొక్కలు నాటినట్లు తెలిపారు. సాగు విస్తీర్ణంపెంచేందుకు రైతులను ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో శిక్షణ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, శిక్షణ సంయుక్త కలెక్టర్ నవీన్ నికోలస్, డీఎఫ్‌వో బాలమణి, మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్, డీఆర్డీవో శ్రీలత, డీఏవోశ్రీధర్ పాల్గొన్నారు.

# రైతు బంధుతో కరెంటు మోటర్

- కొనుగోలు చేసిన గుండ్లపల్లికి చెందిన వంగల రాజిరెడ్డి

తిమ్మాపూర్, జూలై 3: ప్రభుత్వ పథకాల లబ్ధితో కరెంటు మోటర్ కొనుగోలు చేసి దానిపై 'జై కేసీఆర్' అని రాసుకొని సంబురపడ్డాడు గన్నేరువరం మండలం గుండ్లపల్లి గ్రామానికి చెందిన వంగల రాజిరెడ్డి. రైతుబంధు, ఆసరా పింఛన్ కింద ఇటీవల వచ్చిన డబ్బులతో సోమవారం బోరు మోటరు కొనుగోలు చేశాడు. దానిపై 'జై కేసీఆర్' అని రాసి తన అభిమానాన్ని చాటుకున్నాడు. రైతు బాంధవుడు కేసీఆర్ అని కొనియాడాడు. రైతు బంధుతో పాటు పెన్షన్ డబ్బులు దాచుకున్నానని, అయితే మోటర్ పాడవడంతో మార్కెట్‌కు వెళ్లి కొత్త మోటర్ కొనుక్కున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా రాజిరెడ్డిని ఆర్బీఎస్ జిల్లా కోఆర్డినేటర్ గుడెల్లి తిరుపతి అభినందించారు.



కొనుగోలు చేసిన మోటార్ తో వంగల రాజిరెడ్డి